నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, శుక్రవారం 19 ఏప్రిల్ 2024 | RANGAREDDY

# చేవెళ్లలో.. బీసీ అభ్యర్థినే గెలిపిస్తాం

బీసీల సత్తా చూపించాల్సిన సమయం వచ్చింది

ఇటువంటి అవకాశం మళ్లీ రాదు

మన ఓట్లు మనకే నినాదంతో ముందుకు సాగుతాం

బీసీలను చైతన్యపర్చేందుకు పాద యాత్రలు.. గడపగడపకు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తాం

రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం

బీసీల దమ్మేందో చూపించి కులహంకార నేతలకు బుద్ధి చెప్తాం

'నమస్తే తెలంగాణ'తో బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్



రంగారెడ్డి, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : చేవెళ్ల పార్లమెంటు పరిధిలో 70 శాతానికి పైగా బీసీలున్నాం. ఈసారి ఎన్నికల్లో ఖచ్చితంగా బీసీ అభ్యర్థిదే గెలుపు. మెజార్టీగా ఉన్న బీసీల సమస్యలపై పార్లమెంటులో ఓ గొంతుక తప్పని సరి అవసరం. చేవెళ్ల బీసీ సంఘాలు ఇదే ఆలోచన చేస్తున్నాయి. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెచ్చేందుకు బీసీ సేన ప్రయత్నం చేస్తున్నది. పాదయాత్రలను నిర్వహించడంతోపాటు గడపగడపకూ వెళ్లి బీసీ ఓటర్లను చైతన్యపరుస్తాం. ఈ అవకాశం మళ్లీరాదు. బీసీల దమ్మేంటో నిరూపించాల్సిన సమయం వచ్చిందంటున్నారు బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్. చేవెళ్లలో బీసీ అభ్యర్థిని గెలిపించుకుని కులహంకార నేతలకు బుద్ధి చెప్తామని హెచ్చరించారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ' ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**బీఆర్ఎస్ బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం శుభ పరిణామం..**

అత్యధిక ఓటర్లు బీసీ కులాల వారే ఉన్నారు. ఈ విషయం అన్ని రాజకీయ పార్టీలకు తెలుసు. అయినా.. ఓట్లు దండుకోవడానికే నేతలు బీసీలను వాడుకుంటున్నారు. దీనివల్ల బీసీలకు రాజ్యాధికారం కలగానే మిగిలిపోతున్నది. అతి తక్కువ శాతం ఉన్న వర్ణాలవారే అన్నిరకాల పదవులను అనుభవిస్తుండడం బాధాకరం. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలను మోసం చేశాయి. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఆరు సీట్లు కేటాయించి బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం శుభ పరిణామం. బీసీ సమస్యలపై పార్లమెంటులో మాట్లాడేందుకు బీసీ ప్రాతినిధ్యం చాలా అవసరం. ప్రస్తుత ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించి పార్లమెంటుకు పంపించాల్సిన అవసరం ఉంది. ఈసారి ఎన్నికల్లో అన్ని సంఘాలు ఈ దిశగా ఆలోచన చేస్తున్నాయి.

**బీసీలందరినీ ఏకతాటిపైకి తెస్తాం..**

చేవెళ్లలో బీసీ అభ్యర్థికి బీఆర్ఎస్ పార్టీ అవకాశం ఇచ్చింది. కాసాని జ్ఞానేశ్వర్‌ను ఒక పార్టీ అభ్యర్థిగా కాకుండా..బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా చూసి గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకుగాను బీసీలంతా పార్టీలకు అతీతంగా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. బీసీ సేన తరపున బీసీలోని అన్ని కులాలను ఏకం చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని కుల సంఘాలను కలిసి అభ్యర్థించారు. ఎన్నికల సంఘం అనుమతితో రానున్న రోజుల్లో చేవెళ్ల పార్లమెంటు పరిధిలో పాదయాత్రలను చేపట్టాలని అనుకుంటున్నాం. గడపగడపకూ తిరిగి బీసీ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించి చైతన్యపర్చే దిశగా కార్యక్రమాలను నిర్వహిస్తాం. మన ఓట్లు మనకే..నినాదంతో ఈ ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని నిశ్చయించుకున్నాం. బీసీ అభ్యర్థి గెలుపునకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణను రూపొందించుకుని అమలుపర్చనున్నాం.

**దురహంకార నేతలకు మూల్యం చెల్లిస్తాం..**

చేతనైతే బీసీ అభ్యర్థిని గెలిపించండి.. అని కాంగ్రెస్ నేత ఒకరు మాట్లాడుతున్నరు. కుల అహంకారంతోనే ఆయన మాట్లాడినప్పటికీ.. బీసీల్లో కొరవడిన ఐక్యతను ఆయన తన మాటలతో ఎత్తిచూపించారు. బీసీలకు టికెట్లు ఇచ్చినప్పటికీ..గెలిపించుకునే సత్తా చూపించడం లేదన్న భావన ఆ నేత వ్యాఖ్యల్లో కనబడుతున్నది. ఇది బీసీలు గ్రహించి సవాల్‌గా తీసుకోవాలి. ఈ ఎన్నికల్లోనే బీసీలంతా ఐక్యతతో వ్యవహరించి సత్తా చూపించాల్సిన సమయం వచ్చింది. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించుకోవడంపై అన్ని కుల సంఘాలు ఒక నిర్ణయానికి రానున్నాయి. బీసీల దమ్మేంటో ఈ ఎన్నికల్లో చూపించాలనుకుంటున్నారు. ఏదిఏమైనా..బీసీ అభ్యర్థిని గెలిపించి తీరుతం. అలాగే..బీసీలను అణగదొక్కాలనుకుంటున్న నేతలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం.


# తొలి రోజు మూడు నామినేషన్లు

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

చేవెళ్ల ఎంపీ సెగ్మెంట్‌లో ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

రాజేంద్రనగర్‌లోని కార్యాలయంలో నామినేషన్ల దాఖలు

రంగారెడ్డి, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ): లోక్ సభ ఎన్నికలకు సంబంధించి గురువారం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అనంతరం జిల్లాలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి మొదటి రోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బి.వెంకట్‌రమేశ్‌బాబు(సోషలిస్టు ఇండియా పార్టీ), మహ్మద్ ముస్తఫా రిజ్వాన్(స్వతంత్ర అభ్యర్థి), పాలమాకుల మధు(ఇండియా ప్రజా బంధు పార్టీ)లు ఒక్కొక్క నామినేషన్ చొప్పున మూడు నామినేషన్లు దాఖలు చేశారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంకకు నామినేషన్ పత్రాలను సమర్పించారు.




## బీ-ఫామ్‌లు అందించిన కేసీఆర్

రంగారెడ్డి, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశంకు పార్టీ అధినేత కేసీఆర్ గురువారం బీ-ఫామ్‌లు అందజేశారు. కాసాని వెంట మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి ఉండగా.. మల్లేశం వెంట మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



# కారు.. టాప్‌గేర్..

## సీఎం సభలతో దూకుడు పెంచిన గులాబీ క్యాడర్

- నామినేషన్ల తర్వాత క్షేత్రస్థాయిలో జనంలోకి దూసుకెళ్లనున్న గులాబీదళం
- రైతు సమస్యలే ఎజెండాగా ఎన్నికల ప్రచారం
- ఇప్పటికే ప్రజల్లోకి అభ్యర్థులు.. జనం జేజేలు
- మరింత జోరు పెంచేలా బస్సు యాత్రలు, రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్‌కు సమాయత్తం




రంగారెడ్డి, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మరింత స్పీడ్ పెంచనున్నది. రైతు సమస్యలే ప్రధాన ఎజెండాగా క్షేత్రస్థాయిలోకి దూసుకెళ్లనున్నది. సీఎం సభలతో పార్టీ క్యాడర్‌లో కొత్త జోష్ నెలకొనగా.. నామినేషన్ల ప్రక్రియ తర్వాత ఎన్నికల ప్రచారంలో పార్టీ శ్రేణులు మరింత జోరు పెంచనున్నారు. ఎన్నికల షెడ్యూల్ నుంచే ప్రజలతో, పార్టీ శ్రేణులతో మమేకమై బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు పనిచేస్తుండగా.. సబ్బండ వర్గాల నుంచి విశేష స్పందన వస్తున్నది. చేవెళ్ల, భువనగిరి లోక్‌సభ ఎన్నికల్లో బీసీ నినాదంతో వెళ్తుండడం కూడా బీఆర్ఎస్‌కు కలిసి రానున్నది. ఏదేమైనా.. రానున్న రోజుల్లో బస్సు యాత్రలు, కార్నర్ మీటింగ్‌లతో ఎన్నికల వేడిని రాజేసేలా బీఆర్ఎస్ ప్రచారం ఉంటుందని నేతలు చెబుతున్నారు.

**రైతు సమస్యలే ప్రధాన ఎజెండాగా..**

రైతు సమస్యలే ప్రధాన ఎజెండాగా బీఆర్ఎస్ పార్టీ ఈసారి ఎన్నికల సమరంలోకి దిగుతున్నది. అలాగే.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కేసీఆర్ సంకల్పిస్తున్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి ఎండిపోయిన పంటలతో నష్టాల పాలైన రైతుల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నారు. రైతులకు జరిగిన నష్టంపై కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపులేకుండా వ్యవహరిస్తుండడాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. ఎండిన గడ్డి జీవాలకు మేతకు తప్ప దేనికీ పనికిరాకుండా పోయాయి. రైతులకు అండగా ఉండేది.. గులాబీ పార్టీ ఒక్కటే అన్న భరోసాను రైతాంగానికి కల్పిస్తున్నారు. అన్ని సభలు, సమావేశాల్లోనూ ప్రస్తుత కరువు పరిస్థితులకు కాంగ్రెస్ సర్కారే కారణమంటూ ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వస్తూనే కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించారంటూ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ వస్తున్నారు. పాలమూరు-రంగారెడి ప్రాజెక్టు నుంచి నీటి ఎత్తిపోతను తమ ప్రభుత్వం ప్రారంభిస్తే..కాంగ్రెస్ అసలు పట్టించుకోవడం లేదని, ప్రాజెక్టుల నిర్మాణాల ఊసు కూడా లేదని ప్రచారం చేస్తున్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలేదని, సాధ్యం కాని హామీలిచ్చారని, రైతు బంధు లాంటి పథకాలను పక్కన పెట్టిన కాంగ్రెస్‌కు ఓటు వేసే విషయంలో ఆలోచించాలని పార్టీ శ్రేణులు ప్రజలకు కర్తవ్య బోధన చేస్తున్నారు. రుణమాఫీ, రూ.500 బోనస్‌పై పోస్టుకార్డు ఉద్యమం చేపట్టేలా రైతులను బీఆర్ఎస్ చైతన్యపరుస్తున్నది. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటేనన్న విషయాన్ని ప్రజలకు వివరించడం ద్వారా ఓటర్లను బీఆర్ఎస్ వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

**ఎన్నికల వేడి.. విమర్శల వా'ఢీ'..**

నామినేషన్ల పర్వం ముగిసిన వెంటనే బీఆర్ఎస్ ఎన్నికల వేడిని రాజేయడంతోపాటు విమర్శల వాడితో ప్రతిపక్ష పార్టీలను ఇరుకున పెట్టేలా బీఆర్ఎస్ ప్రచారం ఉండనుందని నేతలు పేర్కొంటున్నారు. మిగతా పార్టీలకంటే ముందే పార్టీ అధినేత కేసీఆర్ గులాబీ శ్రేణులను పార్లమెంటు ఎన్నికలకు సన్నద్ధం చేశారు. సమన్వయ సమావేశాలను నిర్వహించి గెలుపు వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. పార్లమెంటు స్థానానికి సమన్వయ కర్తలను సైతం నియమించారు. ఈ నెల 13న చేవెళ్లలో నిర్వహించిన కేసీఆర్ సభ సైతం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఇవన్నీ బీఆర్ఎస్ క్యాడర్‌లో కొత్త ఉత్తేజాన్ని నింపాయి. ఇదే స్ఫూర్తితో పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో మరింత దూకుడును పెంచేందుకు సన్నద్ధులు అవుతున్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలంతా సమన్వయంతో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఐదు పార్లమెంటు స్థానాలన్నింటిలోనూ బీఆర్ఎస్ విజయ బావుటా ఎగుర వేసేలా ముందుకు సాగుతున్నారు. ప్రజలతో మమేకమై ముందుకు వెళ్తున్న ఎంపీ అభ్యర్థులకు సబ్బండ వర్గాల నుంచి విశేష స్పందన వస్తుండడం.. పార్టీ శ్రేణులు కదనోత్సాహంతో పనిచేసేందుకు దోహద పడుతున్నది. గురువారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ మరోసారి పార్టీ నేతలతో సమావేశమై ఎన్నికల్లో గెలుపుపై దిశానిర్దేశం చేశారు. పార్టీ ఎంపీ అభ్యర్థులు కాసాని, క్యామ మల్లేష్‌లకు బీ-ఫామ్‌లను అందజేశారు. కేసీఆర్ దిశా నిర్దేశం మేరకు కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలను ఎండగట్టేలా ప్రచార వ్యూహాలను నేతలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలో బస్సు యాత్రలు, రోడ్డు షోలు, కార్నర్ మీటింగులను నిర్వహించనున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వంటి ముఖ్యనేతల పర్యటనలతో ఎన్నికల ప్రచారంలో కారు టాప్ గేరులో దూసుకుపోనున్నది.



# అనారోగ్య కూలీలతో ఉపాధి పనులొద్దు

**కలెక్టర్ సి.నారాయణరెడ్డి**

వికారాబాద్, ఏప్రిల్ 18 : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద చేపట్టిన పనులకు అనారోగ్యంతో ఉన్న కూలీలను ఎట్టిపరిస్థితిలోనూ తీసుకోవద్దని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్లమెంటు ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఆ నోటిఫికేషన్‌ను ప్రతి ఎంపీడీవో, తహసీల్దార్, ఆర్‌డీవో, ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లేబర్ మొబిలైజేషన్ జరుగాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అనారోగ్యంతో బాధపడే కూలీలను ఉపాధి పనులకు అనుమతించకూడదన్నారు. యాక్టివ్‌గా ఉన్న లేబర్‌ను మాత్రమే పనిలోకి తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లను బాగు చేయడం, ముండ్ల పొదలు తొలగించడం, ఇరిగేషన్, నీటి పొదుపు వంటి గ్రామాలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులకు తప్పనిసరిగా ఎఫ్‌టీవో జనరేట్ చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం పనులు చేస్తే లక్ష్యం చేరుకోవచ్చని అన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీవో జయసుధ, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు సమ్మర్ యాక్షన్ ప్లాన్

- మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్య వస్తే ప్రత్యామ్నాయ మార్గాలపై సన్నద్ధం
- వికారాబాద్ జిల్లాకు రోజుకూ 100 ఎంఎల్‌డీ తాగునీరు అవసరం
- అందుబాటులో 152 ఎంఎల్‌డీ నీరు
- ఇప్పటివరకు 1044 బోర్‌వెల్స్, 477 చేతిపంపులకు మరమ్మతులు పూర్తి



వికారాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీలు, వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం రాకుండా సంబంధిత అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. అయితే మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయినట్లయితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ సరిపోను ఉన్న దృష్ట్యా జిల్లాకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడదని ప్రభుత్వం అంచనాలు వేస్తున్నప్పటికీ ఒకవేళ మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని అందించేందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేసింది. ఇందులో భాగంగా మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులతోపాటు కొత్త పైప్‌లైన్లను ఏర్పాటు చేయడం వంటి పనులను పూర్తి చేశారు. అంతేకాకుండా మిషన్ భగీరథకు ముందు గ్రామాల్లో ఉన్న చేతిపంపులకు మరమ్మతులు చేయడంతో పాటు బోర్‌వెల్స్‌ను కూడా మరమ్మతులు చేపట్టి ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా సిద్ధంగా ఉంచారు. మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని 971 ఆవాసాలకు, 1,98,162 కుటుంబాలకు ఇంటింటికీ నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీటి సరఫరా జరుగుతున్నది. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోయిన దృష్ట్యా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లాలో రికార్డు స్థాయిలో 13.93 అడుగులకు భూగర్భజలాలు అడుగంటిపోవడం గమనార్హం.

**అందుబాటులో సరిపోను తాగునీరు...**

జిల్లాలోని 1.98 లక్షల కుటుంబాలకు సరిపోను తాగునీటిని మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్నారు. అయితే జిల్లాకు రోజుకు 100 ఎంఎల్‌డీ తాగునీరు అవసరంకాగా, ప్రస్తుతం అవసరానికి మించి పంపింగ్ చేస్తున్నారు. పరిగి మండలం రాఘవాపూర్ ప్లాంట్‌తోపాటు కొడంగల్‌లోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా జిల్లాలోని వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి నియోజకవర్గాలకు తాగునీటిని అందిస్తున్నారు. రాఘవాపూర్ ప్లాంట్ ద్వారా 135 ఎంఎల్‌డీ తాగునీటిని, కొడంగల్‌లోని ప్లాంట్ ద్వారా 17 ఎంఎల్‌డీ తాగునీటిని పంపింగ్ చేస్తున్నారు. జిల్లాలోని అవసరమైన తాగునీటి కంటే అదనంగా 52 ఎంఎల్‌డీ తాగునీటిని పంపింగ్ చేస్తున్నారు. మరోవైపు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని గండీడ్, మహ్మదాబాద్ మండలాలకు కూడా రాఘవాపూర్ ప్లాంట్ నుంచే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏదైనా సమస్యలు ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా కొడంగల్ నియోజకవర్గంతోపాటు తాండూరు మున్సిపాలిటీలకు కాగ్నా నది నుంచి తాగునీటిని పంపింగ్ చేసే విధంగా జిల్లా ఉన్నతాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కొడంగల్ నియోజకవర్గంతోపాటు యాలాల మండలంలోని 9 గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని అందించేందుకుగాను 100 హెచ్‌పీ మోటర్లతో పంపింగ్ చేసి 2.5 ఎంఎల్‌డీ తాగునీటిని అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇంకా తాండూరు మున్సిపాలిటీకి కాగ్నా నది నుంచి 80 హెచ్‌పీ మోటర్‌తో పంపింగ్ చేసి 2.5 ఎంఎల్‌డీ తాగునీటిని సరఫరా చేసేలా ముందస్తు చర్యలు చేపట్టారు. అంతేకాకుండా కొడంగల్ నియోజకవర్గానికి తాగునీటిని అందించేందుకు పంపింగ్ చేసే 100 హెచ్‌పీ మోటర్ సామర్థ్యాన్ని 250 హెచ్‌పీ సామర్థ్యానికి పెంచేందుకు అధికారులు నిర్ణయించారు. మరోవైపు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయినట్లయితే ప్రత్యామ్నాయ మార్గాల్లో భాగంగా చేతిపంపులు, బోర్‌వెల్స్ ద్వారా తాగునీటిని అందించేందుకుగాను చర్యలు చేపట్టారు.

ఇందుకోసం జిల్లాలోని 1044 బోర్‌వెల్స్, 477 చేతిపంపులకు మరమ్మతులు పూర్తి చేసి సిద్ధం చేశారు. మరోవైపు పశువులకు కూడా తాగునీటిని అందించేందుకు జిల్లావ్యాప్తంగా 432 పశువుల తొట్టెలను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు మిగతా వాటికి మరమ్మతులు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అయితే సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కుగాను జిల్లాలో 11.50 కోట్ల నిధులను జిల్లా ఉన్నతాధికారులు అందుబాటులో ఉంచారు. వీటిలో ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.6.50 కోట్లు, డీఎంఎఫ్‌టీ నుంచి రూ.3.50 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.1.50 కోట్లను తాగునీటి అవసరాలకు వినియోగించేందుకుగాను జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంచింది.

**తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు...**



జిల్లాలో తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ ద్వారా జిల్లాకు అవసరానికి మించి నీటిని పంపింగ్ చేస్తున్నాం. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని గండీడ్, మహ్మదాబాద్ మండలాలకు కూడా ఇక్కడి నుంచి నీరందిస్తున్నాం. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీరు సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టాం. చేతిపంపులు, బోర్‌వెల్స్‌కు మరమ్మతులు చేశాం.

**- కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

# కళాశాలలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

షాబాద్, ఏప్రిల్ 18: జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను రెప్యూటెడ్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలు/ వెనుకబడిన తరగతులు/ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ/ దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థుల ప్రవేశంకోసం కాలేజీల యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో అన్ని ప్రాథమిక వసతులు, సౌకర్యాలు కలిగిన అనుబంధ వసతి గృహం ఉండాలని పేర్కొన్నారు. కళాశాలల్లో మౌలిక వసతులు కలిగిన ప్రయోగశాలలు, తరగతి గదులు, డార్మిటరీ, విశాలమైన ఆటస్థలం కలిగి ఉండాలని, కళాశాల భవనంలో పూర్తిస్థాయి అగ్నిమాపక సౌకర్యం తప్పనిసరి అని పేర్కొన్నారు. కళాశాలలో గత 3 సంవత్సరాల నుంచి వరుసగా 90 శాతానికి పైగా ఉత్తీర్ణత కలిగి ఉండి, కనీసం 50శాతం మొదటి శ్రేణిలో, డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. కళాశాలలో ఐ.ఐ.టి/ఐ.ఇ.ఇ/ఏ.ఐ.ఇ.ఇ.ఇ/ఎంసెట్ అర్హత పరీక్షల్లో ఉన్నత స్థాయి ఉత్తీర్ణత శాతం కలిగి ఉండాలని, కళాశాలలో అనుభవం కలిగిన బోధనా సిబ్బంది, మంచి స్థాయిలో పూర్తి వసతి కలిగిన లైబ్రరీ, ప్రయోగశాలలు ఉండాలని పేర్కొన్నారు. పై అర్హతలు కలిగి ఉన్న జూనియర్ కళాశాలలు E pass Web Site Online లో తమ తమ కళాశాలలను చివరి తేది 27-04-2024 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.